స్వర్ణకమలాలు

మునసబు రంగారావుగారు సాయంత్రమనగా చెప్పారని ఏడుకొండలు అర కడుపు భోజనంచేసి ఆ రాత్రే చెరువు గట్టున చెట్టుకింద గుడ్డ పరచుకొని పడుకున్నాడు. ఆకాశం వంక చూస్తే అక్కడ చందమామా చుక్కలూ కనబడలేదు. మబ్బు మబ్బుగా ఉంది. చుట్టూ చూస్తే చింతచెట్టు నాలుగుకొమ్మలూ చెరువు గట్టంతా ఆవరించుకొని చీకటి చీకటి చేశాయి. ఆ కొమ్మల నాశ్రయించుకున్న పక్షిజాలం మధ్యమధ్య చేసే కలకలారావాలు గుండెలో గుబులు పుట్టిస్తున్నాయి. వీటితోపాటు ఇంకెవరయినా వస్తారేమోనన్న భయం కడుపులో గుభేలు మంటున్నది.

భయమే. తెల్లవారితే వినాయకచవితి. ఆ తామరకొలనులో ఉన్న ఎరుపూ తెలుపూ కలవపూలను మునసబుగారు పూజకని కోసుకు రమ్మన్నారు. ఆయన పెద్దకూతురు ఐదేళ్ళ కొడుకును ఎత్తుకుని వచ్చింది. ఆ బాబు తొలిసారిగా నావియకుడిని పెట్టుకుని పూజచేసుకుంటాడు. అందుకని పత్రి మిగతా పూలు తీసుకు రావిటానికి మరొక మనిషిని పంపించి ఏడుకొండలిని కలువపూల కోసమని ప్రత్యేకంగా పంపించాడు.

ఏడు కొండలు ఏ పనిమీద వెళ్ళినా పని ఖాయంగా చేసుకువస్తాడు. పనిలో నసుగులేదు. కాని- ఆ ఊళ్ళో వినాయక చవితినాడు అందరి కళ్ళూ ఆ కొలను మీదనే ఉంటాయి. కొలను నిండా నీళ్ళు- ఎర్రకలవలూ తెల్లకలవలూ కన్ను చెదిరేటట్టు ఉన్నాయి. అందరికీ కలువపూలు దొరికే చోటదే. అందరికీ పూజలు, అందరూ ఆ కలువలతోనే వినాయకుడిని పూజించాలని ఆశ పడతారు.

ఆ పూలు ముందు కోసుకున్న వాళ్ళకు తప్ప కాస్త ఆలస్యంగా వచ్చిన వాళ్ళకు దొరకటం కష్టము.

మునసబుగారింటికి కండువా నిండా పూలు కోసుకు వెళ్లితే తీపి ఉండ్రాళ్లతో పెద్దమ్మగారు కడుపునిండా అన్నం పెడతారు. తలుచుకుంటేనే కళ్లు మిలమిల్లాడతాయి.

ఏడుకొండలకి కళ్లు మూతలు పడుతున్నాయి. మధ్య మధ్య ఉలికిపాటుతో కళ్లు తెరుస్తున్నాడు. కాస్త మబ్బులు విచ్చుకుని తూరుపుదిశ తెలతెల వారుతుంటే నీళ్లల్లోకి దిగి పూలు కోసుకోవచ్చు.

కాని-ఇంకా మబ్బు మబ్బుగానే ఉంది.

మళ్లీ కళ్లు మూశాడు.

టపటప చినుకులు పై నుంచి పడ్డాయి. చినుకలు ముళ్లు గుచ్చుకున్నట్టుగా గుచ్చుకున్నాయి. పైబట్ట తడిపింది. తుళ్లిపడి లేచాడు. బట్ట కప్పుకుని ముడుచుకుని కూర్చున్నాడు.

చిటపట చినుకులల్లా జడివానయింది.

ఇదేం వాన? పై నుంచి కిందికి ఒకటే ధార-ఆగకుండా.

ఎంతసేపు చూసినా తగ్గే సూచనలు కనబడటంలేదు.

ఏడుకొండలికి ఈ వానలోనే తెల్లవారి పోతుందేమోనన్న భయం పట్టుకుంది. తెల్లవారితే అందరూ వస్తారు. తనకు ఒక్క పూవయినా మిగల్చరు. అమ్మో! మునసబుగారు? వట్టి చేతులతో పోతే తాట ఒలిచేస్తారు.

గజగజలాడుతూ ముడుచుకుని కూర్చున్నాడు ఏడుకొండలు.

పెద్దమ్మగారు పెట్టే భోజనం-విస్తరినిండా అన్నం-తీపిఉండ్రాళ్లు కళ్లకు కట్టినట్టు. కనబడుతున్నాయి నోరూరుతున్నది.

ఏడుకొండలు ఆకాశం వంక ఒకసారి-చెరువు వంక ఒకసారి చూస్తున్నాడు.

ఎప్పుడు తగ్గాలి ఈ వాన? ఇవాళే ముంచుకు రావాలా తనను పరీక్షించినట్టు?

ఏడుకొండలు పదిహేడు పద్దెనిమిదేండ్ల వాడు. నల్లగా నిగనిగలాడుతూ కండలు తేరి ఉంటాడు. చింతాకంత కళ్లయినా చురుగ్గా విశితంగా చూస్తాయి. ఆ ఊరి పిల్లకారులోకల్లా ధైర్య సాహసాలు కలవాడు. ఏడుకొండలు పేరు చెబితే కొందరు గజగజలాడతారు.

వాన ఉధృతం క్రమంగా తగ్గుతోంది.

మబ్బులు విచ్చుకుంటున్నాయి.

ఏడుకొండలు లేచాడు. ముసుగుగా కప్పుకున్న బట్ట గట్టిగా పిండి జోలె మాదిరిగా నడుముకు కట్టుకున్నాడు. మెల్లగా అడుగులు వేస్తూ చెరువులోకి దిగాడు. వానపడటంవల్ల చెరువులోకి దిగుతున్న కొద్దీ చలి అనిపించింది. తొడ లోతుకు పోయినప్పుడు మరి కాస్త చలిగా ఉంది. ఇంకా ముందుకు పోవాలి చెరువు మధ్యలో తామరాకులు-వాటి మధ్య పూలు కాడలు పైకి లేచి పూలు నీటిమట్టానికి మూరెడు పైన-తలలూపుకుంటూ తేల ఆడుతున్నాయి. కొన్ని అరవిచ్చినవి-కొన్ని పూర్తిగా విచ్చినవి.

చెరువు మధ్యకు పోతుంటే ఏడుకొండలకు భుజాలు మునిగాయి. మెల్లగా అడుగులు వేస్తున్నాడు. ఆ చెరువులో నీటినాగు ఉందని వారం రోజులనాడు ఎవరో చెప్పారు. జలగలు ఉన్నట్టు ఏడుకొండలికి కూడా తెలుసు. అవే [illegible] అతడి ఒంటిని పీకుతున్నట్లనిపిస్తోంది.

చేతులతో దేహం నిమురుకుంటూ ముందుకు పోతున్నాడు. నాచులాంటివి ఏవేవో తీగెలూ చెత్తా కాళ్లకు చుట్టుకుని అడుగు పడనివ్వటంలేదు. ఏడుకొండలు కాళ్లు విదిలించుకుంటూ అడుగులు వేస్తున్నాడు. అడుగులు దిగబడుతున్నాయి. బలవంతంగా పైకి లాక్కుంటున్నాడు. తామరాకులచుట్టూ పేరుకునిపోయిన నాచును పక్కకు నెడుతున్నాడు. మధ్య మధ్య పట్టుకుని పీకే జలగలను దులుపుకోవాలని ప్రయత్నం చేస్తున్నాడు. బారలు చాపి తామర పూలను కాడలతో తుంచి ఒడికి కట్టుకున్న జోలెలో వేసుకుంటున్నాడు.

తెల్లవారినట్లనిపించి ఆకాశం వంక చూశాడు. తూరుపు దిశ ఎర్రబారింది. బంతిలా దొర్లుకుంటూ భూమి మీదినుంచి జేగురుముద్దలా బాలభానుడు లేతకిరణాలను ప్రసరింపచేస్తూ పైపైకి ఎగబాకుతున్నాడు.

ఏడు కొండలికి తొందర పుట్టింది. కనపడినంత వరకూ ఎరుపూ తెలుపూ తామర పూలను అందినంతకూ కోసి తన జోలెలో వేసుకున్నాడు. మరొకసారి చెరువంతా కలయజూశాడు. తామరపూలిక లేవు. ఒకటీ అరా ఉన్నప్పటికీ అవి

కుంటీ గుడ్డీ అన్నట్టుగా ఉన్నాయి. మంచివన్నీ తనే కోశాడు. తృప్తిగా వెనక్కు తిరిగాడు.

తిరిగి వచ్చేటప్పుడు చలే అనిపించలేదు. బరువును ఈడ్చుకుంటూ అడుగులు వేస్తూ ఒడ్డుకు చేరుకున్నాడు. నడుముకు కట్టుకున్న బట్టను జాగ్రత్తగా విప్పి నేలమీద పరచాడు.

అబ్బ. ఎన్నిపూలు? ఎన్నిపూలు? అసలెట్లా కొయ్యగలిగాడు- ఇన్నిపూలు? అతడికే ఆశ్చర్యంగా ఉంది

వాటిని చూసి అతడి మనసు ఆనందంతో పొంగి గంతులు వేయటం మొదలుపెట్టింది.

అప్పుడు- అతడికి తన దేహబాధ బాగా తెలిసింది. మొలతాటికి కట్టుకున్న చాకు తీసుకుని తనను అప్పటినుంచీ కొరుకుతున్న జలగలను పట్టుకుని కొయ్యటం మొదలుపెట్టాడు.

జలగలు చచ్చినా పట్టు విడవవు. తన దేహంలోకి చాకు పోనిచ్చి జలగలను లాగిపారేస్తున్నాడు. గాయాలలోనుంచి రక్తం కారుతున్నది.

ఏడుకొండలు మళ్లీ నీళ్లలోకి దిగాడు. ఒళ్లంతా రాచి రాచి కడుక్కున్నాడు. వర్షానికి తడిసిన తలను నీళ్లలో ముంచి రుద్దుకుంటూ తలారా మళ్లీ స్నానం చేశాడు. బట్ట ఒంటిమీదనే పిండుకుంటూ ఒడ్డుకు చేరాడు.

అప్పటికి బాలస్కరుడు మరికొంత పైకి వచ్చాడు కిరణాల నులివెచ్చదనం తగ్గుతున్నది కాంతితో పాటు వేడి కూడా ఎక్కువవుతున్నది.

బట్టమీద తను కోసిన తామరపూలన్నీ సూర్యుడికి అభిముఖంగా పేర్చుకుంటూ పోయాడు ఏడుకొండలు అప్పటికి అన్నీ విచ్చుతున్నాయి.

ఏడుకొండలికి పదివరకే లెక్కపెట్టటం వచ్చు. పది పది వంతున లెక్కపెట్టాడు. మూరు: తను వందపూలుకోశాడా? ఇన్ని కోసినట్టే అనిపించలేదు;

ఏడుకొండలు కళ్లు బాగా విప్పి ఆ పూలను చూశాడొకసారి.

సూర్యభగవానుడి కిరణాలు ఆ పూల మీద ప్రసరించి తెల్లటి పూలమీద ఎర్రటి పూలమీద బంగారువుప్పొడి చల్లినట్లనిపిస్తోంది అతడి కళ్లకు కొంత సేపటికి అవి బంగారు పూలేననిపించాయి.

అయితే-ఇవన్నీ బంగారు పూలా? బంగారు తామరపూలా! అతడి మనసు ఆనందంతో గంతులు వేసింది.

ఈ పూలు మునసబు రంగారావుగారి మనమడు పెట్టుకునే వినాయకుడికా?

ఏడుకొండలు మనసు అదోలా అయిపోయింది.

ఇంతవరకూ అతడు పూజలు చేయలేదు-చేస్తుండగా చూడలేదు.

అతడి మనసులో భావవీచిక ఒకటి తళుక్కున మెరిసింది.

ఇంత అందమైన ఈ పూలతో తనే పూజ చేస్తే?

భయంలాంటిదేదో వెన్ను పొడుగునా పాకినట్లయింది. దేహం గగుర్పొడిచింది.

మళ్లీ తనలో తనే సంబాళించుకున్నాడు. భయమెందుకు? తనేం తప్పు చేస్తున్నాడు?

కాని_ఏడుకొండలకి పూజ చెయ్యాలన్న సంకల్పం దృఢంగా కలిగిన తరువాత ఒక సందేహం వచ్చింది.

తనకు వినాయకుడు ఏడీ! వినాయకుడు లేందే పూజ ఎట్లా చెయ్యటం?

మెరుపులాంటి ఊహ మనసులో మెరిసింది.

నేలమీద నీళ్లు చల్లి రెండు చదరపు గజాల స్థలం శుభ్రం చేశాడు. వేలితో వినాయకుడి బొమ్మ గీయటానికి ప్రయత్నించాడు.

వినాయకుడు ఎట్లా ఉంటాడు?

కూర్చున్నట్టు గియ్యటానికి ప్రయత్నించాడు. గీస్తూ తుడుపుతూ కొంత సేపయిన తరువాత వినాయకుడికి తుండం ఇట్లా ఉంటుందని మనసులో ఊహించు

కుని ఓ అక్షరంలా గీశాడు. ఆ రెండు చదరపు గజాల నేలను ఆ తామర పూలతో నింపివేశాడు.

ఆదృశ్యమతడిని పులకరింప చేసింది.

బంగారు వృష్పొడి చల్లినట్లున్న ఆ తామరపూల మీద సూర్యకిరణాలు పడి మెరిసి పోతున్నాయి.

మనసు నిండా ఆనందం-కళ్లనిండా సంతోషం-శరీరం పులకలు తేలింది.

ఏడుకొండలు ఆ పూల ముందర సాగిల పడ్డాడు. రెండు చేతులూ తల మీద పెట్టుకుని జోడించాడు.

"సామీ! సామీ! సామీ! ఇవి బంగారు పూలు నీ కోసం తెచ్చిన సామీ! నీ కోసం కష్టపడి తెచ్చిన."

కళ్లు గట్టిగా మూసుకున్నాడు. ఆ మూసిన కళ్లనిండా బంగారు తామరలు-కళ్లు తెరిచాడు. అలే బంగారు తామరలు, ఎటు చూసినా అవే బంగారు పూలు.

ఆ సంభ్రమంలో ఏడుకొండలు మునసబు రంగారావుగారు పూజకు పూలు తెమ్మన్నమాట మరచాడు, పెద్దమ్మగారు తీయటి ఉండ్రాళ్లతో పెట్టబోయే భోజనం సంగతి విస్మరించాడు.

ఎనిమిది గంటలు కావచ్చింది. తామరపూల కోసమని క్రిందటి రోజు రాత్రి వెళ్లిన ఏడుకొండలు అంతవరకూ రాలేదని మునసబు రంగారావుగారు పాలేర్ల మీద కోప్పడుతున్నారు. వీధి వాకిట్లో కాలు కాలిన పిల్లిలా తిరుగుతున్నారు.

కొంత సేపటికి "ఒరే మల్లేశం! ఒరే వెంకటేశూ! మీరిద్దరూ చెరువు దగ్గరికి వెళ్లి చూసిరండి. ఏడుకొండలు ఎటన్నా వెళ్లాడా? లేక ఆ చెరువులో మునిగిపోయాడా? చూడండి. కనబడితే ఏడుకొండలిని చేతులుకట్టి లాక్కురండి" ఆజ్ఞాపించారు-మునసబు రంగారావుగారు.

బాణా కర్రలు తీసుకుని మీసాలు మెలివేసుకుంటూ చెరువు దగ్గరికి వచ్చిన వెంకటేశూ మల్లేశూ సాగిలపడిన ఏడుకొండలిని చూసి విస్మయపడ్డారు.

"ఏందిరా ఎడుకొండలూ ? మునసబుగారు పూలు కోసుకురమ్మంటే ఈడ సాగిలపడ్డ వేందిరా? పూలుకోశావుగా ?" అన్నారు ఇద్దరు.

ఏడుకొండలు కళ్లు తెరిచాడు. బాణా కర్రలనూ వాళ్లనూ చూశాడు.

"యెంకటేశూ ! మల్లేశూ ! నేను ఇనాయకుణ్ణి ఇక్కడే ఏలితో గీసి ఈ పూలతో పూజ చేసిన. ఇవి చెరువులో పూసిన వట్టి తామరలు కావు. బంగారు తామరలు. మీరు కూడా చెరువులో మునిగి తడిబట్టలతో వచ్చి సాగిలపడి కళ్లు మూసుకోండి. ఏరా. మనమెప్పుడయిన ఈటితో పూజలు చేసినమా? అసలు పూజలు చేసినమా ఎన్నడైన ? రండి రండి" అన్నాడు.

వెంకటేశు కళ్లు అదృశ్యం చూడగానే మిరుమిట్లు గొలిపాయి. వెంటనే చెరువులోకి దిగి స్నానంచేసి వచ్చాడు. ఏడుకొండలు చెప్పినట్టు సాష్టాంగ పడ్డాడు.

మల్లేశు "ఏందిరోయ్ యెంకటేశు ? మునసబుగారు పంపించింది ఎందుకు ? సాగిల పడటానికా ?" బాణా కర్ర నేలకు కొట్టి ఒక్క అరుపు అరిచాడు.

"నేరాను. నేరాను." చేతిసైగ చేశాడు వెంకటేశు. "ఏమన్న చేసుకో" ముఖం తిప్పుకున్నాడు.

"నీవు రాకపోతే ఈ పూలు తీసుకుపోతా" అన్నాడు మల్లేశు.

"వాటిని తాకకు. వాటిని తాకకు" ఏడుకొండలు బెదిరించినట్టు అన్నాడు.

మల్లేశుకు ఏడుకొండలు ఎటువంటివాడో తెలుసు. కోపం వస్తే రక్తం కళ్ల జూస్తాడు.

"అయితే నేపోతా. ల మునసబు దొరకే మీవంగతి చెప్తా. పదిమందిని పంపిస్తడు గుంజుకు రమ్మని" అంటూ వెనక్కు తిరిగి ఆ పూలను చూస్తూ మల్లేశు ముందుకు అడుగులు వేశాడు.

అతడి మనను పీకుతున్నది - తనుకూడా చెరువులో మునిగి వెంకటేశు పక్కన సాగిలపడాలని. కాని- మునసబుగారు చేతికిచ్చిన బాణాకర్ర అతడిని ముందుకు నడిపించుకు పోతున్నది.

తామరపూరేకులు వెంకటేశుకూ ఏడుకొండలకూ అభయమిస్తున్నట్టుగా తలలూపుతున్నాయి బంగారు వన్నెలో మెరిసిపోతూ.

(ఆలిండియా రేడియో)